క్లుప్తంగా

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు


మద్ది అంజన్న ఉత్సవమూర్తితో ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామివారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం 1,14,698 వచ్చినట్లు, 800 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ


విద్యార్థులకు కళ్లజోళ్లు అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో జరిగిన నేత్ర వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన విద్యార్థులకు సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి రాజా చేతుల మీదుగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేత్ర సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు అశ్రద్ధ వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. వార్డు సభ్యులు శివాజీ, శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అందరి బాధ్యత


ఆశ్రమం వీధిలో డ్రెయిన్ల నిర్వహణ పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ కమిషనర్

చింతలపూడి : పారిశుద్ధ్య నిర్వహణ ప్రజలందరి బాధ్యత అని నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆశ్రమం వీధిలో చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పంచాయతీలో ప్రణాళికా బద్ధంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వీధుల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలన్నారు. నగర పంచాయతీని క్లీన్ పట్టణంగా తీర్చి దిద్దడానికి పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి : చింతలపూడి ఐటీఐ కళాశాలలో అసోసియేటివ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చింతలపూడి ఐటీఐ ప్రిన్సిపాల్ ఏఎస్‌వీ కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉండి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్ / ఐటీఐ / డిగ్రీ / పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతీ యువకులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. 30లోపు వయస్సు కలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న వారికి మూడు నెలల పాటు శిక్షణ అందిస్తామన్నారు. వివరాలకు స్కిల్‌హబ్ కో–ఆర్డినేటర్ కార్తీక్ 90008 03414ను సంప్రదించాలన్నారు.

నేడు మానసిక రుగ్మతలపై అవగాహన సదస్సు

కొయ్యలగూడెం : మంగపతిదేవి పేట, బోడిగూడెం సచివాలయం పరిధిలో బోడిగూడెం రామాలయం వద్ద మానసిక రుగ్మతలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్తేర్ రాణి తెలిపారు. సదస్సులో ఏలూరు నుంచి వస్తున్న మానసిక వైద్య బృందం మానసిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం కల్పించి, చికిత్స విధానాన్ని తెలియజేస్తారని పేర్కొన్నారు.

రేపు బోనాలు సమర్పణ

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం బోనాలు సమర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారిని శాకాంబరి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బోనాలు సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

జగన్ పాలనలోనే పేదల ఆర్థికాభివృద్ధి

- ధర్మాజీగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- కండ్రికగూడెంలో ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


లింగపాలెం : ధర్మాజీగూడెంలో బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


బుట్టాయగూడెం : కండ్రికగూడెంలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

లింగపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే ఎలీజాకు అడుగడుగునా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఎలీజా సర్పంచ్ కొత్తూరు మౌనిక, సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్ పార్టీనాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాతగారి కాలనీలో సీసీ డ్రెయిన్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం త్వరలో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఎలీజా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. తమ ప్రభుత్వం ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగలమన్న ధీమా తమలో ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ ఛైర్మన్ దయాల నవీన్ బాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, ధర్మాజీగూడెం వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మేకల రాజు, మండల సచివాలయాల ఇన్‌చార్జి అన్నపనేని శాంతరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తాడేపల్లి శాంతరావు, కొత్తూరి రమేష్, నూతలపాటి శ్రీను, గుండిమేడ శ్రీను, మందలపు నరిశింహరావు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బుట్టాయగూడెం : సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని రెడ్డిగణపవరం సచివాలయం పరిధిలోని కండ్రికగూడెంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారుల బెడద లేకుండా నేరుగా పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. అర్హతే ప్రామాణికంగా తమ ప్రభుత్వం పథకాలను మంజూరు చేస్తుందని చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందడం ద్వారా పేదలు ఆర్థికంగా బలపడుతున్నారని అన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పినవారికే పథకాలు అందేవని, జగనన్న ప్రభుత్వంలో అర్హులకు నేరుగా పథకాలు అందుతున్నాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. కండ్రికగూడెంలో రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. అదేవిధంగా రూ.4 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాగప్పగూడెంలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో చేపట్టే వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్ రావు, సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, బన్నే బుచ్చిరాజు, తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, పొడియం లక్ష్మి, ఎంపీటీసీలు గాలి దుర్గారావు, మొడియం వెంకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కోఆప్షన్ మెంబర్ ఎస్‌కే బాజీ, నాయకులు ఎన్ఎస్‌వీ వెంకట్రావు, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పోలవరం పోరుకేక

కుక్కునూరు : సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం పోరుకేక పాదయాత్ర మంగళవారం కుక్కునూరు చేరుకుంది. ఈ సందర్భంగా కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్ట్‌ను జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం నిర్వాసితులకు పునరావాస పరిహారం ఇవ్వనని చేతులెత్తేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రం కాలర్ పట్టుకోనైనా నిధులు తీసుకొచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా ఉంటే తాడో పేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త సహాయకుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్త సహాయకుల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐటీడీఏ పీఓ జీవీవీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ పద్మజ ఆధ్వర్యంలో కుక్కునూరు, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం ప్రాజెక్టు పరిధిలోని ఖాళీ పోస్టులకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 19 అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులు ఖాళీ ఉండగా సుమారు 62 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 42 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పారదర్శకంగానే ఇంటర్వ్యూలు నిర్వహించామని పీఓ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ ఈ.తులసి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మేలు చేసేలా జగనన్న సురక్ష


లింగపాలెం : జగనన్న సురక్షపై వివరిస్తున్న మండల సచివాలయ కన్వీనర్ శాంతరావు


చింతలపూడి : చింతంపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లింగపాలెం : అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చడమే లక్ష్యంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లింగపాలెం మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు కోరారు. లింగపాలెం, ధర్మాజీగూడెం తదితర గ్రామాల్లో మంగళవారం వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతరావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ మట్టా సురేష్, బి.ప్రభాకరెడ్డి, చీదరాల ప్రసాద్, జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : జగనన్న సురక్ష పథకం విజయవంతానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఐటీడీఏ ఇన్‌చార్జి, పీఓ, జగనన్న సురక్ష పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పీఓ చాంబర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని మండలాల్లోని అధికారులు, వలంటీర్లకు పథకం అమలుపై అవగాహన కార్యక్రమం పూర్తి చేశామన్నారు. నిర్దేశించిన ప్రకారం సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. జగనన్న సురక్ష పథకంలో అర్హులను గుర్తించి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి అందించేవిధంగా కృషి చేస్తున్నామని చెప్పారు.

జులై 1 నుంచి జగనన్న సురక్ష

టి.నరసాపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం వారధిలాంటిదని ఎంపీడీవో బీఎస్ఎల్ మంగాకుమారి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పక్కా షెడ్యూల్‌తో ప్రతి గ్రామంలో జగనన్న సురక్షకార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు బృందాలను ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కుల, నివాస, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భూకొనుగోలు అనంతరం ఆన్‌లైన్ నమోదు, ఆన్‌లైన్‌లో భూవివరాలు నమోదు, చేర్పులు, వివాహ ధ్రువీకరణపత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులో మొబైల్ నెంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాలలో పేర్ల తొలగింపు వంటి సర్వీసులు అందించడం జరుగుతుందన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణజ్యోతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని చింతంపల్లి గ్రామంలో సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జులై 1వ తేదీ నుంచి అర్హత ఉన్న ప్రతిఒక్కరినీ గుర్తించి సంక్షేమ ఫలాలు అందించేందుకు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపుల్లో ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ చెప్పారు. జనన, మరణ, కుల, రేషన్‌కార్డు డివిజన్, సీసీఆర్‌సీ, హౌస్‌హోల్డ్ డివిజన్, ఇన్‌కం తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఈ క్యాంపుల్లో అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర రామకృష్ణరావు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయండి

పోలవరం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు విజయవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీవో జి.శ్రీను పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలో ఈ కార్యక్రమంపై సర్వేలో పాల్గొని వలంటీర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగనన్న సురక్షకు సంబంధించి గ్రామసభలు నిర్వహించేందుకు ముందుగా లబ్ధిదారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అవసరమైన వివిధ సర్టిఫికెట్లకు సంబంధించి వలంటీర్లు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు కూడా అందజేసే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


తాడువాయిలో హైస్కూల్‌లో మాట్లాడుతున్న సర్పంచ్ సత్యవతి

జంగారెడ్డిగూడెం రూరల్ : విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో ఎదగాలని తాడువాయి సర్పంచ్ యరమాల సత్యవతి అన్నారు. మండలంలోని తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో రాములు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌వీఎల్ నర్సమాంబ పాల్గొన్నారు. మండలంలోని గొల్లగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పంగం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేబడుతుందన్నారు. అమ్మఒడి, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సదుపాయాలు ఏర్పాటు చేశారని, కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి కోరారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ఆణిముత్యాలు, నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, ఇంగ్లీష్ మీడియం తదితర కార్యక్రమాలను ప్రారంభించినట్లు వివరించారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద శ్రద్ధ తీసుకుని తమ పిల్లలను చదివించాలన్నారు. అనంతరం 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ పాడుం పుష్ప, ప్రధానోపాధ్యాయుడు బీఎస్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


అశోక్ నగర్ ప్రాంతంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం : స్థానిక అశోక్‌నగర్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ప్రారంభించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ మట్ట వనజ లక్ష్మి ఎంపీటీసీలు ఈ సందర్భంగా కొబ్బరికాయలు కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్‌కుమారి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కృషితో మంజూరైన రూ.80 లక్షలతో పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులకు చొరవ చూపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పంచాయతీ ఉపసర్పంచ్ సంకు కొండను ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంట శ్రీను, చింత శ్రీదేవి, షేక్ బాజీ, వార్డ్ మెంబర్ గొలిశెట్టి ప్రసాద్, సచివాలయం కన్వీనర్ రాజు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతో పండుగను నిర్వహించుకోవాలి


జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ముస్లింలతో సమావేశం నిర్వహిస్తున్న సీఐ పి.రాజేష్

జంగారెడ్డిగూడెం : బక్రీద్ పండుగను ఉత్సాహకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ముస్లింలకు జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ సూచించారు. జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ముస్లింలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండుగ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముస్లింలు ఐక్యతతో పండుగను నిర్వహించుకోవాలన్నారు. తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా బక్రీద్ పండుగ ఆత్మను పరిరక్షించుకోవాలని సీఐ సూచించారు. ఈ సందర్భంగా ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిజేయజేశారు. పట్టణంలోని అన్ని మసీదుల పెద్దలు, కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : తొలి ఏకాదశి, బక్రీద్ వేడుకలను హిందూ ముస్లిం సోదరులు మతసామరస్యంతో నిర్వహించుకోవాలని ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం మసీదు వద్ద మతపెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 29వ తేదీన హిందువులకు పవిత్రమైన తొలి ఏకాదశి, అదే రోజు బక్రీద్ పండుగలు వచ్చాయని ఈ నేపథ్యంలో ఇరుమతాలవారు శాంతి సామరస్యాలతో మెలగాలన్నారు. పోలవరం రోడ్‌లోని మసీదు, హిందూ ఆలయాలు ఒకే ప్రాంతంలో ఉన్నాయని కొన్ని దశాబ్దాలుగా ఇరువర్గాల వారు కలిసిమెలిసి వేడుకలు నిర్వహించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎస్సై కితాబు ఇచ్చారు.

నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కుక్కునూరు : నిర్వాసితులకు వెంటనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పోడుభూముల సాగుదారులకు పట్టాలివ్వాలని కోరుతూ మంగళవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా డివిజన్ కమిటీ కార్యదర్శి గౌస్ మాట్లాడుతూ, గత జులై నెలలో వచ్చిన గోదావరి వరదల వలన మండలంలోని అన్ని గ్రామాలను ముంచేశాయన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇలా ఉంటే సర్వే అధికారుల కాంటూర్ లెక్కలు, లైడర్ సర్వేలు అంటూ గ్రామాలను కలుపుతూ, తీసేయడం వంటివి చేస్తూ నిర్వాసితుల జీవితాలతో ఆడుకోవడం అన్యాయమన్నారు. 41,45 కాంటూర్‌లను రద్దు చేసి ఏ, బీ బ్లాక్‌లను రద్దుచేసి నిర్వాసితులందరికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు బి సత్యనారాయణ, మండల సహాయ కార్యదర్శి కొండ ప్రసాద్, మచ్చ లక్ష్మయ్య, ఎం.ఆదయ్య, ఎం.గంగరాజు, ఎం.ముత్తమ్మ, ఎస్ భీమరాజు, ఎం.లక్ష్మయ్య, ఎం.పూసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రాచన్నగూడెంలో 'గడపగడపకు'

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో బుధవారం ఉదయం 8గంటలకు గడగపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు.

వలంటీర్ల సమస్యకు పరిష్కారం

కుకునూరు : సాంకేతిక లోపంతో పేర్లు ఆన్‌లైన్ కాకపోవడం కారణంగా మండలంలోని మాధవరం సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు వేతనాలు అందడం లేదని వచ్చిన ఫిర్యాదుపై కుకునూరు ఎంపీడీవో శ్రీనివాస్ స్పందించి వెంటనే చర్యలు చేపట్టారు. మంగళవారం సీఎఫ్ఎంఎస్ అధికారులతో మాట్లాడి ఆన్‌లైన్ చేయడంలో ఉన్న సాంకేతిక సమస్యను వివరించి వారి ద్వారా సమస్యను పరిష్కరింపచేశారు. ఇకపై వలంటీర్ల వేతనాలు విషయంలో జాప్యం ఉండదని, సాంకేతిక సమస్య కారణంగానే వేతనాలు అందడంలో జాప్యం జరిగినట్లు ఎంపీడీవో చెప్పారు. త్వరలోనే వలంటీర్ల ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో 4 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ–బి మహిళ – 1, ఎస్సీ మహిళ – 1, ఎస్టీ మహిళ – 1, ఓసీ – 1 కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. జులై 2వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఎంపిక కాబడిన వారు 8వ తేదీ నుంచి విధులకు హాజరు కావాల్సి ఉంటుందని, వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కొయ్యలగూడెం రోటరీ క్లబ్‌కి పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న క్లబ్ ప్రతినిధులు

కొయ్యలగూడెం : రోటరీ క్లబ్ కొయ్యలగూడెం శాఖ (31840) నిర్వహించిన సేవలకు గాను ఉత్తమ పురస్కారాలు, అవార్డులు లభించినట్లు క్లబ్ అధ్యక్షుడు సిరివెళ్ల సుబ్రమణ్యం మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో విజయనగరంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ఏకేఎస్ భాస్కరరాం చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నామన్నారు. బెస్ట్ క్లబ్బు, బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ అసిస్టెంట్ గవర్నర్, బెస్ట్ జిల్లా జాయింట్ సెక్రెటరీ, బెస్ట్ ఎండ్ పోలియో, ఇలా పలు విభాగాలలో అవార్డులు ప్రదానం చేయడం జరిగిందన్నారు. క్లబ్‌కి 8 అవార్డులు లభించాయన్నారు. ఈ సందర్భంగా అవార్డులు పొందిన వారిని క్లబ్ సభ్యులు అభినందించారు.

జూలై 3న గురుపౌర్ణమి వేడుకలు

జంగారెడ్డిగూడెం : స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని ఎంబీ సోషల్ క్లబ్‌ఆవరణలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో జూలై 3న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 4.30 గంటలకు కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమై రాత్రి 9 గంటలకు శేజ హారతితో పరిపూర్ణం అవుతాయని వివరించారు. భక్తులు పాల్గొని, వారి సహయ సహకారాలు అందించాలని కమిటీ కోరింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 21వ తేదీ రాత్రి లక్కవరానికి చెందిన మల్లెల్లి వెంకట్రావు (50) తన గ్రామం వెళ్లేందుకు ఐరన్ లోడుతో వెళుతున్న ఆటో ఎక్కాడు. అయితే పేరంపేట రోడ్డులో ఆటో బోల్తా పడి ఐరన్ ఊసలు వెంకట్రావుపై పడ్డాయి. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి వెంకట్రావు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

రేపు వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం : వివిధ నేరాల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 29వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు పోలవరం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎస్ఈబీ డిప్యూటీ కమీషనర్, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ స్టేషన్‌లో 10 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని, వివరాలకు పోలవరం ఎస్ఈబీ స్టేషన్‌లో గాని, 94409 02432, 94411 44332 నెంబర్లకు గాని సంప్రదించాలన్నారు.